

ఇంకెంత కాలం? 8లో▸

2017లో ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ డీఎస్సీ నిర్వహించలేదు. ఏడేళ్లుగా నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నారు.



రద్దీకి అనుగుణంగా బస్సులు

మేడారం జాతరకు వెళ్లే భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ రఘునాథ్‌రావు సూచించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం

35.2 /22.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

'పది' ప్రశ్నపత్రాల పంపిణీ



ప్రశ్నపత్రాలు అందిస్తున్న కుమారస్వామి

మంచిర్యాలఅర్బన్: ఈనెల 9 నుంచి నిర్వహించనున్న పదో తరగతి గ్రాండ్ టెస్టుల ప్రశ్నపత్రాలను జిల్లా డీసీఈబీ కార్యాలయంలో మంగళవారం పంంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు గ్రాండ్ టెస్ట్ ప్రశ్నపత్రాలను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. సమయం ప్రకారం పరీక్షలు నిర్వహించాలని డీసీఈబీ కార్యదర్శి భీంరావు తెలిపారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎంవీఐ మోగేశ్వర్‌సింగ్ అన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖా కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారిపై రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, చిన్నారులకు వాహనాలకు ఇవ్వకుండా నియంత్రించడంపై అందరూ చైతన్యం కావాలని వివరించారు.

బాల్క సుమన్ మాటలపై ప్రజల్లో అసహనం



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

మంచిర్యాలటౌన్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై ప్రజల్లో అసహనం బెల్లుబికిందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాలలోని తన నివాసంలో మంగళవారం మాట్లాడారు. ఇలాంటి భాషను ఇలాంటి భాషను మొదలు పెట్టింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని గుర్తు చేశారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు ఎంతో మందిని దుర్భాషలాడారని తెలిపారు. జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, గద్దర్‌ను కేసీఆర్ అవమానపరిచారని గుర్తుచేశారు. సుమన్ చెప్పు చూపిండం వెనుక కూడా కేసీఆర్ ఉన్నారని పేర్కొన్నారు. వాస్తవంగా సుమన్ కేసీఆర్‌కు చెప్పు చూపించాలనుకున్నాడని, రేవంత్‌రెడ్డికి కాదని అన్నారు. కేసీఆర్ బానిసత్వంలో బాల్క సుమన్ చిన్న వ్యక్తి అని, అధికారం పోయిందనే ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చెప్పే నిజాలను తట్టుకోలేక పోతున్నారని విమర్శించారు. చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా, మళ్లీ తప్పులు చేస్తున్నారన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీఆర్ఎస్ గెలవదని అన్నారు. ఎంపీ వెంకటేశ్ నేతతోపాటు, చాలామంది బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిపారు.

శివాజీ విగ్రహానికి స్థలం కేటాయించాలని వినతి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు స్థలం కేటాయించాలని ఛత్రపతి శివాజీ విగ్రహసాధన సమితి నాయకులు కర్ణకంటి రవీందర్, హిందు వాహిణి జిల్లా సంయోజక్ గణేశ్ కోరారు. ఈమేరకు కలెక్టర్ బదావత్ సంతోష్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. విగ్రహ ప్రతిష్టాపన కోసం అధికారులకు మూడేళ్లుగా విన్నవించినా అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు. ఈనెల 19న శివాజీ జయంతి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అర్చనటెక్స్ చౌరస్తా, లక్ష్మీటాకీస్‌చౌరస్తా, ఐబీచౌరస్తా, వైశ్యభవన్ బైపాస్ రోడ్‌లో ఏదో ఒక చోట స్థలం కేటాయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ నాయకులు రామగిరి శ్రీనివాస్, ఉమేశ్, అరవింద్, మహానంద్, రవీందర్, బోయినిహరికృష్ణ, అమిరిశెట్టి రాజ్‌కుమార్, పల్లి రాజేశ్ ఉన్నారు.

ఆరోగ్య కేంద్రానికి భూమి కేటాయించాలని..

భీమారం: మండల కేంద్రంలో ప్రభుత్వ పాథమిక ఆరోగ్యకేంద్రానికి భూమి కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేశ్, ఆవిడపు రవితేజ కలెక్టర్ బదావత్ సంతోష్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఆరోగ్య కేంద్రం మంజూరైనా స్థలం లేకపోవడంతో నిర్మాణం చేపట్టడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడితో ఫోన్‌లో మాట్లాడారు. భూమి కేటాయింపు కోసం సర్వేయర్‌ని పంపిస్తామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఆవిడపు మహేశ్, ఎడ్ల ప్రభాకర్, మాటేటి సాగర్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో టికెట్ రేస్..!



ఎంపీ వెంకటేశ్ నేత

గడ్డం వంశీకృష్ణ

రామిళ్ల రాధిక

గోమాస శ్రీనివాస్

పెర్క శ్యామ్

- పెరుగుతున్న ఎంపీ అభ్యర్థులు
- తాజాగా సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత చేరిక..
- గడ్డం వంశీ పోటీపై ఓ వర్గంలో వ్యతిరేకత
- ఆసక్తికరంగా పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి ఎంపిక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: హస్తం పార్టీలో ఎంపీ టికెట్ రేసు మొదలైంది. ఇప్పటికే అధిష్టానం ఇప్పటికే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి పోటీ చేసేందుకు మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, ఆగం చంద్రశేఖర్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు వంశీకృష్ణ, గోమాస శ్రీనివాస్, పెర్క శ్యా మ్, రామిళ్ల రాధికతోపాటు మొత్తం 29 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ నేత బొర్లకుంట వెంకటేశ్‌నేత తాజాగా 'కారు'దిగి 'హస్తం' గూటికి చేరడంతో హస్తం పార్టీలో టికెట్ రేసు ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే వచ్చి న దరఖాస్తుల్లో పెర్క శ్యామ్, వంశీకృష్ణ, మహిళా కోటాలో రామిళ్ల రాధికను కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ పరిగణలోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ పేర్లనే కేంద్ర ఎన్నికల కమిటీకి పంపుతారు. సిట్టింగ్ ఎంపీ చేరికతో ఆయన కూడా టికెట్ రేసులో చేరారు. సామాజిక సమీకరణాల్లో మాదిగ, మాల, నేతకాని, మహిళా, ప్రజల్లో బలం, ఆర్థిక కారణాలు ఇలా పలు కోణాల్లో పరిశీలన చేసి తుది ఎంపిక జరుగుతుందని నాయకులు చెబుతున్నారు.

కొడుకు కోసం వివేక్ పట్టు

ఎంపీ టికెట్ తెచ్చుకునేందుకు ఎమ్మెల్యే వివేక్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. తన తండ్రి గడ్డం వెంకటస్వామి తర్వాత పెద్దపల్లి నుంచి వివేక్ పోటీ చేసి గెలిచారు. తాజాగా ఆయన కుమారుడు విశాఖ ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న వంశీకృష్ణను లోక్ సభ బరిలో దింపేందుకు ఢిల్లీ స్థాయిలో మంత్రాంగం నడుపుతున్నారు. తమ కుటుంబానికి ఏఐసీసీ పెద్దల అండ ఉండడంతో తమకే టికెట్ వస్తుందనే ధీమాలో ఉన్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ పరిధిలో యువతను ఆకట్టుకునేందుకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. వంశీ గత అసెంబ్లీ ఎన్నికల నుంచే క్రియాశీలకంగా ఉంటున్నారు. అయితే ఒక కుటుంబం నుంచే అన్న గడ్డం వినోద్ బెల్లంపల్లి ఎమ్మెల్యేగా, తమ్ముడు వివేక్ చెన్నూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇప్పుడు తనయుడు వంశీకి సైతం టికెట్ ఇస్తే, మిగతా వారి పరిస్థితి ఏంటని పార్టీలో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఓ వర్గం గడ్డం సోదరుల ఆధిపత్యం జిల్లాలో ఎక్కువ అవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో వంశీకి టికెట్ వస్తే మరోవర్గాన్ని ఎలా ఎదుర్కొంటుందన్నది ఆసక్తిగా మారింది.

బలంగా ఉన్న 'హస్తం' పార్టీ

మూడు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి, మంథని, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. బీఆర్ఎస్ అభ్యర్థులకన్నా 2 లక్షల ఓట్లు ఎక్కువగా వచ్చాయి. అభ్యర్థి కన్నా పార్టీ బలంగా ఉండడంతో ఎవరు పోటీ చేసినా విజయం ఖాయం అన్న ఆశతో ఉన్నారు. దీంతో ఎలాగైనా టికెట్ తెచ్చుకోవాలని జిల్లా నాయకత్వం నుంచి మొదలు, గాంధీ భవన్, ఢిల్లీ దాకా ఎవరి లాబీయింగ్ వారు చేస్తున్నారు. మరి టికెట్ రేసులో ఎవరు విన్నర్ అవుతారో త్వరలోనే తేలనుంది.

వెంకటేశ్ నేత రాకతో..

తాజాగా సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత ఈసారి బీఆర్ఎస్ టికెట్ రాదని భావించి కాంగ్రెస్ గూటికి చేరారని చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకే కారు పార్టీతో తెగదెంపులు చేసుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో గడ్డం వంశీని పక్కన పెట్టి వెంకటేశ్‌కు టికెట్ వస్తుందా?అన్న చర్చ కూడా పార్టీలో జరుగుతోంది. మరోవైపు పెద్ద నాయకుల రాకతో చిన్న నాయకులకు పోటీచేసే అవకాశం లేకుండా పోతుందనే ఆవేదన ఆశావహుల్లో పెరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం గడ్డం వివేక్ రాకతో చెన్నూరులో పోటీ చేయాలనుకున్న నాయకులంతా పక్కకు జరిగారు. ఆ టైంలో కొంత మంది పార్టీని వీడగా, మరికొందరు అసంతృప్తిలోనే ఎన్నికల్లో పనిచేశారు. తాజాగా ఎంపీ టికెట్ విషయంలోనూ గడ్డం కుటుంబం నుంచే పోటీ ఎదురుకావడంతో అధికార పార్టీ ఆశావహులకు మింగుడు పడడంలేదు.

సుమన్ వ్యాఖ్యలపై పెల్లుబికిన నిరసనలు



నస్పూర్‌లో సుమన్ ఫ్లెక్సీకి చెప్పుల దండవేసి గాడిదపై ఊరేగిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎం రేవంత్‌రెడ్డిపై మంచిర్యాల జిల్లా చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. మంచిర్యాల పట్టణం, చెన్నూరు, బెల్లంపల్లి, నస్పూర్‌తోపాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సుమన్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. శవయాత్రలు నిర్వహించారు. సుమన్ చిత్రపటానికి చెప్పుల దండలు వేసి గాడిదపై ఊరేగించారు. చెన్నూరు పట్టణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మదహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సుమన్‌పై చెన్నూరు, బెల్లంపల్లి పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఐపీసీ 294–బీ, 504, 506 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేస్తున్నారంటూ ప్రచారం జరిగింది. పోలీసులు మాత్రం అలాంటిదేమీ లేదని తెలిపారు.

సుమన్.. నోరు అదుపులో పెట్టుకో..

మంచిర్యాలటౌన్: చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని మంచిర్యాల కాంగ్రెస్ నాయకులు వార్నింగ్ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డిని చెప్పుతో కొడతానని చేసిన వ్యాఖ్యలపై మంగళవారం భగ్గుమన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశాల మేరకు కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, యువజన, విద్యార్థి సంఘాల శ్రేణులు బెల్లంపల్లి చౌరస్తాలో సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అంతకు ముందు ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత మాట్లాడారు. ప్రజాపాలనను చూసి ఓర్వలేక బాల్క సుమన్ అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. స్థానికేతరుడైన బాల్క సుమన్ మంచిర్యాల జిల్లాలో అలజడి సృష్టించేందుకు కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. అతని అహంకారానికి చెన్నూరు ప్రజలు మొన్నటి ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పినా తీరు మారలేదన్నారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే జిల్లా నుంచే తరిమి కొడతామని హెచ్చరించారు. కేసీఆర్ మెప్పు కోసం కాంగ్రెస్‌పై, సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని అన్నారు. పోలీసులు వెంటనే సుమన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



మంచిర్యాలలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విధుల్లో నిర్లక్ష్యం.. ఆరుగురి సస్పెన్షన్

- కేటీఆర్ పరిధిలో అటవీ అధికారులపై వేటు

జన్నారం: విధుల్లో నిర్లక్ష్యం, అడవి రక్షణలో విఫలం అయిన ఆరుగురు ఫారెస్ట్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని జన్నారం, ఆసిఫాబాద్, ఖానాపూర్ అటవీ డివిజన్ల పరిధిలో పనిచేసే ముగ్గురు సెక్షన్ అధికారులు, ముగ్గురు బీట్ అధికారులను సస్పెండ్ చేస్తూ టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ డైరెక్టర్, చీఫ్ కన్జర్వేటర్ శాంతరామ్ ఉత్తర్వులు జారీ చేశారు.

కలప నిల్వలు గుర్తించి..

ఆసిఫాబాద్ అటవీ డివిజన్ జోడేఘాట్ రేంజ్ పరిధిలోని కొత్తపల్లి శివారులో రూ.4 లక్షల విలువైన కలపను అధికారులు గుర్తించారు. కలపను స్వాధీనం చేసుకుని విచారణ చేశారు. ఈ కలప జన్నారం, ఖానాపూర్ అటవీ డివిజన్ల నుంచి తరలించి నిల్వ చేసినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో ఈనెల 4, 5 తేదీల్లో బీట్లను తనిఖీ చేసి రిపోర్టు ఇవ్వాలని ఎఫ్‌డీపీటీ ఆదేశించారు. మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో ఖానాపూర్ డివిజన్ ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని ఇస్లాంపూర్ సెక్షన్‌లోని పలు బీట్‌లు, జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ కవ్వాల్ సెక్షన్ పరిధిలోని రాయికుంట బీట్‌లలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో టేకు చెట్లు నరికివేసినట్లు గుర్తించారు. పూర్తి వివరాలను అందజేయడంతో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకున్నారు.

మూడు డివిజన్లు.. ఆరుగురు అధికారులు..

కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలోని మూడు అటవీ డివిజన్ల పరిధిలోని ఆరుగురు అధికారులను సస్పెండ్ చేస్తూ ఎఫ్‌డీపీటీ, సీఎఫ్ శాంతరామ్ ఉత్తర్వులు జారీ చేశారు. జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్ కవ్వాల్ సెక్షన్ అధికారి అఫ్జల్‌ఖాన్, బీట్ అధికారి రంగ శ్రీధర్, ఆసిఫాబాద్ డివిజన్‌లోని జోడేఘాట్ రేంజ్ ఇస్లాంపూర్ సెక్షన్ అధికారి వినయ్‌కుమార్, కొత్తపల్లి బీట్ అధికారి ఇమ్రాన్‌ఖాన్, ఖానాపూర్ డివిజన్‌లోని ఉడుంపూర్ రేంజ్ ఇస్లాంపూర్ సెక్షన్ అధికారి ఎల్.రవికుమార్, బీట్ అధికారి భూమేశ్‌ను సస్పెండ్ చేశారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఉపాధి కల్పన అధికారి వెంకటరమణ

చెన్నూర్: ఉపాధి అవకాశాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పన అధికారి వెంకటరమణ సూచించారు. స్థానిక ఎంఆర్ఆర్ గార్డెన్‌లో తెలంగాణ ఉపాధి శిక్షణ సంస్థ అధ్వర్యంలో ప్రొడక్టవిటీ కౌన్సిల్ సభ్యులతో నిరుద్యోగ యువతీ, ఎస్సీ, ఎస్టీ యువకులకు వేర్వేరుగా నైపుణ్య శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యతోపాటు వృత్తి నైపుణ్యం ఉంటే భవిష్యత్తు ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం యువతీ, యువకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీపీసీ కోఆర్డినేటర్ సత్యం, శిక్షకులు ఎండీ.యాసీన్, సుజీత్ పాల్గొన్నారు.



చెన్నూర్ ఎంఆర్ఆర్ గార్డెన్‌లో యువకులకు ఉపాధి శిక్షణ ఇచ్చిన ప్రొడక్టవిటీ కౌన్సిల్ సభ్యులు

'కాళ్లు మొక్కుత.. చైర్‌పర్సన్ మాటలు నమ్మొద్దు'

- ఎమ్మెల్యే కాళ్లు మొక్కి న కౌన్సిలర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత నాలుగేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదు. ఆమె మాటలు నమ్మకండి..' అని ఓ కౌన్సిలర్ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కాళ్లు మొక్కి వేడుకున్నాడు. ఈ ఘటన మున్సిపల్ కార్యాలయంలోనే జరిగింది. మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే వినోద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం ముగిసిన తర్వాత వినోద్ చైర్‌పర్సన్ శ్వేత చాంబర్‌కు వెళ్లారు. చాంబర్ నుంచి ఎమ్మెల్యే బయటకు వస్తుండగా పలువురు కౌన్సిలర్లు ఒక్కసారిగా అడ్డుకున్నారు. నాలుగేళ్లలో చైర్‌పర్సన్ మున్సిపాలిటీలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఆమె తప్పుడు మాటలు నమ్మొద్దని కోరారు. ఈ సందర్భంగా 20వ వార్డు కౌన్సిలర్ గోసిక రమేశ్ ఎమ్మెల్యే కాళ్లు మొక్కి ప్రాధేయపడ్డాడు. ఈమేరకు స్పందిన ఎమ్మెల్యే అభివృద్ధి కోసం కౌన్సిలర్ల సలహాలు, సూచనలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం కార్యాలయం నుంచి ఎమ్మెల్యే వెళ్లి పోయారు.



వినోద్‌ను వేడుకుంటున్న కౌన్సిలర్ రమేశ్

కాంగ్రెస్ ఖాతాలోకి క్యాతనపల్లి!

- వికటించిన బీఆర్ఎస్ 'అవిశ్వాసం'
- వ్యూహాత్మకంగా కాంగ్రెస్‌లో చేరిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్
- కోరంలేక వీగిన అవిశ్వాసం
- నెలరోజుల ఉత్కంఠకు తెర

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లింది. నిన్నటి వరకు బీఆర్ఎస్ తరఫున చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి ఉన్నారు. వీరిపై సొంతపార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం మంగళవారం కోరం లేకపోవడంతో వీగిపోయింది. సొంతపార్టీ కౌన్సిలర్లు వేసిన ఎత్తుకు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పైఎత్తు వేసి.. అవిశ్వాసాన్ని చిత్తు చేశారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తోపాటు 9 మంది కౌన్సిలర్లు ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఇప్పుడు క్యాతనపల్లి 'హస్త'గతమైంది.

కోరం లేక..

క్యాతనపల్లి చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై బీఆర్ఎస్‌కు చెందిన 17 మంది అవిశ్వాసం ప్రకటించారు. ఈమేరకు కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారు. దీనిపై ఆర్డీవో రాములు ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. మొత్తం 22 మంది కౌన్సిలర్లలో 2/3 సభ్యులు అనగా 15 మంది తీర్మానానికి మద్దతుగా పాల్గొనాల్సి ఉండగా, కాంగ్రెస్ శిబిరంలో ఉన్న 9 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాలేదు. బీఆర్ఎస్‌కు చెందిన 13 మంది కౌన్సిలర్లు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు తొలుత సమావేశం ప్రారంభం కాగా కేవలం బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. దీంతో మధ్యాహ్నం 2 గంటల వరకు సమయం పొడిగించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ఓటింగ్ జరుగాల్సి ఉండగా అప్పటికీ సభ్యులెవరూ హాజరుకాలేదు. 2 గంటల వరకు బీఆర్ఎస్‌కు చెందిన మరో ఏడుగురు హాజరయ్యారు. అయినా సరైన కోరంలేక అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో ప్రకటించారు. అవిశ్వాసం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నెలరోజుల ఉత్కంఠకు తెర..

క్యాతనపల్లి మున్సిపాలిటీలో నెల రోజులుగా ఉన్న ఉత్కంఠ, హైడ్రామాకు మంగళవారం నాటితో తెర పడింది. బీఆర్ఎస్ కౌన్సిలర్లే వ్యూహాత్మకంగా అడుగులు వేసి సొంత పాలకవర్గంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెల్సిందే. కానీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరి అవిశ్వాసం పెట్టిన వారికి షాక్ ఇచ్చారు. దీంతో అవిశ్వాసం వ్యూహం బెడిసి కొట్టింది.



హాజరైన 13మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు



సంబరాల్లో క్యాంపులో ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

విపత్తులపై అవగాహన పెంచుకోవాలి




అవగాహన కల్పిస్తున్న బిటాన్ సింగ్

తాండూర్: భారీ వరదలు, భూకంపాలు లాంటి విపత్తులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, అవి సంభవించినప్పుడు ఎలా కాపాడుకోవాలో తెలుసుకోవాలని పదో బెటాలియన్ కమాండర్ బిటాన్ సింగ్ సూచించారు. మండలం కేంద్రంలోని సురభి మినీ ఫంక్షన్ హాల్‌లో జాతీయ విపత్తులపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విపత్తులు సంభవించినప్పుడు తమను తాము కాపాడుకుంటూనే ఇతరులను ఎలా కాపాడాలో ప్రాక్టికల్‌గా వివరించారు. గుండెపోటు వచ్చిన వ్యక్తిని కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఏదైనా ప్రమాదంలో చిక్కుకున్నపుడు ఎవరి సహాయం లేకుండా ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో చూపించారు.

'మమ్మల్ని రెగ్యులరైజ్ చేయండి'

మంచిర్యాలటౌన్: ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడుకు ఆ స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం వినతిపత్రం అందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగుల క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో చేతుల మీదుగా మంగళవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈ నెల 16వ తేదీన సమ్మెలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్‌ఖన్నా మాట్లాడుతూ రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. గతంలో 13 రోజులు సమ్మె చేయగా, వాటికి సంబంధించిన వేతనం కొందరికే చెల్లించారని తెలిపారు. సమ్మెకాలపు వేతనాలు, ప్రస్తుత రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డీఎంహెచ్‌వోను కోరారు. వేతనాలు వచ్చేలా చూస్తానని డీఎంహెచ్‌వో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపు యాదవ్, రాజ్‌కుమార్, భాగ్యలక్ష్మి, సతీశ్ కుమార్, ప్రవీణ, రజిని, నవీన్ పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల క్యాలెండర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు

మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

మంచిర్యాలటౌన్: తెలంగాణ వైద్యవిధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయం పరిధిలో ఒప్పంద ప్రాతిపదికన సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టు పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా వచ్చిన దరఖాస్తుల ప్రాథమిక మెరిట్ జాబితాను ప్రకటించారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు ఎం.కోటేశ్వర్ పేర్కొన్నారు. ప్రాథమిక జాబితాను వెబ్‌సైట్‌తోపాటు జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం నోటీసు బోర్డుపై ఉంచామని తెలిపారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

దాడి కేసులో ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: దాడికి పాల్పడిన వ్యక్తికి ఏడాది పాటు జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.సంపత్ మంగళ వారం తీర్పునిచ్చినట్లు పట్టణ సీఐ ఎస్పీ రవీం దర్ తెలిపారు. 2021 మే 13న జిల్లా కేంద్రం లోని రాంనగర్‌కు చెందిన కమారపు సందీప్, అదేకాలనీకి చెందిన దేవుని శ్రీలతపై బండ రాయితో దాడి చేశాడు. మహిళ సోదరుడు శనిగారపు రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు లో నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష, జరిమానా విధించారు.

కార్పొరేట్ ఉద్యోగాలు సాధించడమే లక్ష్యం

జన్నారం: మా కాలేజీలో చదివిన విద్యార్థులు కార్పొరేట్ ఉద్యోగాలు పొందేలా చేయడమే మా లక్ష్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్‌ఓజా అన్నారు. మంగ ళవారం తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెం టర్ కోఆర్డినేటర్లు మంజుల, నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లా డుతూ ఇంటర్వ్యూకు 150 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ముథూట్ కంపనీలో 26 మంది, రామ్‌లో 22 మంది, 24 సెవెన్‌లో 48 మంది, హెటిరోలో 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

బాల్క సుమన్ దిష్టి బొమ్మ దహనం

శ్రీరాంపూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ఐఎన్టీయూసీ నాయకులు మంగళవారం బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిని విమర్శిం చే నైతిక హక్కు సుమన్‌కు లేదన్నారు. స్థాయి చూసుకుని విమర్శించాలన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు ఓడించినా ఆయనకు బుద్ధిరావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం చిన్నయ్య, బరపటి మారుతి, కాల్వ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకెంత కాలం?



నిర్మల్ జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న అభ్యర్థులు

- టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూపు
- పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్
- తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని వినతి
- నేడు విద్యాశాఖ ఆఫీస్ ముట్టడికి పిలుపు
- హైదరాబాద్‌కు తరలివెళ్తున్న అభ్యర్థులు

నిర్మల్ ఖిల్లా: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2017లో ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసిన గత బీఆర్ ఎస్ ప్రభుత్వం మళ్లీ డీఎస్సీ నిర్వహించలేదు. అప్పుడు 8,792 ఖాళీలతో నోటిఫికేషన్ విడుదల చేసి ఎంపికైన అభ్యర్థులకు 2019లో నియామకాలు కల్పించింది. అప్పటినుంచి ఏడేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యో గాల కోసం నిరీక్షించారు. రెండు నెలలుగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతూ విజ్ఞప్తులు చేశారు. ధర్నాలు, రాస్తారోకోలతో డిమాండ్ వినిపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈనెల 7న హైదరాబాద్ లోని విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ ఎక్కువ ఖాళీలతో విడుదల చేయాలని కోరుతున్నారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం డీఎస్సీ నోటి ఫికేషన్ విడుదల చేసింది. అయితే ఉమ్మడి జిల్లా లోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలవారీగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య తక్కువ ఉందని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఖాళీలు పెంచాలంటున్న అభ్యర్థులు

ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు గతంలో వెలువరించిన నోటిఫికేషన్‌కు మరిన్ని పోస్టులు కలిపి అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయా లని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు. ఈ నోటి ఫికేషన్‌లో ఎస్జీటి, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, పం డిట్ తదితర టీచర్ల ఖాళీలను గతంలో ఉన్న వాటి కంటే పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాలని కోరు తున్నారు. ఇదే అంశంపై జిల్లాకు చెందిన డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు జిల్లావిద్యా శాఖాధికారి కార్యాలయంలో పలుసార్లు వినతిప త్రం అందజేశారు. అయితే ఇప్పటికే స్కూల్ అసి స్టెంట్లకు పీజీహెచ్‌ఎం లుగా ప్రమోషన్లు ఇవ్వ డంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఎక్కువ గా ఉన్నట్లు పేర్కొంటు న్నారు. అయితే ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే క్రమం లోనే కోర్టు కేసుల వివాదంతో ప్రక్రియ నిలిచింది. అయితే టెట్ అర్హత ఉన్నవారికి స్కూల్ అసిస్టెంట్లు గా ప్రమోషన్లకు అర్హులని కోర్టు మధ్యంతర ఉత్త ర్వులు వెలువరించడంతో ఈ ప్రక్రియకు అడ్డంకిగా మారింది. ఈ అవాంతరాలను అధిగమించి డీఎస్సీ నోటిఫికేషన్ సత్వరమే జారీ చేయాలని, ఉపా ధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం చేయా లని నిరుద్యోగులు కోరుతున్నారు.

గత నోటిఫికేషన్ ఖాళీలు ఇలా...

జిల్లా	ఎస్ఏ	ఎస్జీటీ	ఎల్‌పీ	పీఈటీలు	మొత్తం
ఆదిలాబాద్	54	206	13	02	275
కుమురంభీం	49	214	24	02	289
మంచిర్యాల	36	58	16	03	113
నిర్మల్	16	91	04	04	115

ప్రమోషన్లు చేపడితే మరిన్ని ఖాళీలు

ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చి అవకాశం కల్పిస్తే క్షేత్రస్థాయిలోని ఎస్జీటీ పోస్టుల్లో ఖాళీలు మరిన్ని ఏర్పడే అవకాశాలున్నాయి. నిర్మల్ జిల్లాలో గతంలో ఉపాధ్యాయ ఖాళీలు 461 ఉండ గా ప్రమోషన్లు చేపడితే మరిన్ని ఖాళీలు పెరిగే అవ కాశాలున్నట్లు నిరుద్యోగ అభ్యర్థులు పేర్కొంటు న్నారు. కోర్టు చిక్కులను పరిష్కరించి ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు 'చలో హైదరాబాద్'

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మం చిర్యాల జిల్లాలోని డీఎడ్ బీఎడ్ అభ్యర్థుల సం ఘం ప్రతినిధులు 'చలో హైదరాబాద్' కార్యక్ర మానికి పిలుపునిచ్చారు. పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయాన్ని బుధవారం ముట్టడించు నున్నట్లు పేర్కొంటున్నారు. మంగళవారం రాత్రి అభ్యర్థులు రాష్ట్ర రాజధానికి బయలుదేరి వెళ్లారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు ముం దే రాష్ట్రవ్యాప్తంగా 20వేల ఉపాధ్యాయ ఉద్యో గాలకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయా లని కోరుతున్నారు. ఎస్జీటీలకు స్కూల్ అసి స్టెంట్లుగా ప్రమోషన్ ప్రక్రియ కూడా సత్వరమే పూర్తి చేసి ఏర్పడిన ఖాళీలు ఇందులో కలపా లని అంటున్నారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థు లు పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారమని, ఉద్యోగాల కోసం సుదీర్ఘకాలంగా వేచి చూస్తున్నామని పేర్కొన్నారు. డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం జిల్లా ప్రతినిధులు ఆనంద్‌బాబు, తిరుమలేశ్, సురేశ్ తదితరు లున్నారు. 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ వచ్చి విజయవంతం చేయాలని కోరుతున్నారు.

'కాకా' స్మారక క్రికెట్ పోటీలు



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్(చెన్నూర్): కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ పోటీలు మంగళ వారం పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పెద్దపల్లి పార్ల మెంట్ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సాహించాలన్న ఉద్దేశంతో ఏ టా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రె స్ నాయకుడు వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాం తం నుంచి భారత జట్టుకు ఆడే క్రీడాకారులను చూ డాలన్న లక్ష్యంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతంలో నైపుణ్యం గల క్రీడాకారులను తప్పక ప్రోత్సాహిస్తామన్నారు. విజేతలకు రూ.3 లక్షలు, రన్నరప్‌కు రూ.2 లక్షల క్యాష్ అవార్డు అం దించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, బొలిశెట్టి కనకయ్య, అబ్దుల్ అజీజ్, ఆకుల రాజన్న, పుల్లూరి కళ్యాణ్, నీలం రాకేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థులు

భీమారం(చెన్నూర్): జనవరి 27, 28 తేదీల్లో తమిళ నాడు రాష్ట్రంలో జరిగిన జాతీయ స్కేటింగ్ పోటీల్లో భీమారం మండలం పోలంపల్లి పీరల్ ఆఫ్ ఇం డియా పాఠశాలకు చెందిన విద్యార్థులు నోయల్ జాయ్, అంజన్న, అఖిల్ రెండు సిల్వర్, ఒక బ్రాం జ్ పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యా యుడు సుధాకర్ తెలిపారు. 28న నస్పూర్‌లో జరిగిన అండర్-8, 12, 14 అథ్లెటిక్ పోటీల్లో 100 మీటర్ల రన్నింగ్‌తో పాటు లాంగ్‌జంప్ పోటీల్లో అం జన్న, జెర్రీ గోల్డ్‌మెడల్ సాధించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యా ర్థులను హెచ్‌ఎం అభినందించారు.

అన్న కళ్లెదుటే.. తమ్ముడి మృతి

- నీటి గుంతలో పడడంతో ఘటన
- పార్డీ గ్రామంలో విషాదం



అశోక్ (ఫైల్)

కౌటాల: అన్న కళ్లెదుటే తమ్ముడు నీటిగుంతలో పడి మృతి చెందిన విషాద ఘటన కౌటాల మండలం లోని పార్డీలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దంద్రే పరుశురాం-జిజాబాయి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు అశోక్ (23) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. పార్డీ శివారులోని మిర్చి పం టకు సాగునీరు అందించేందుకు మూడు రోజుల క్రితం జేసీబీతో చేనులో నీటి గుంతను తవ్విం చారు. అందులో ఆయిల్ ఇంజన్ ఫుట్‌బాల్ సరిచేయ డానికి అశోక్ గుంతలోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. సోదరుడు విలాస్ తన తమ్ముడిని కాపాడేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. తన కళ్లముందే తమ్ముడు విగతజీవిగా మారడంతో కన్నీరుమున్నీరుగా విలపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్ సామాజిక ఆస్ప త్రికి తరలించారు. విలాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌వోటూ జీఎం

శ్రీరాంపూర్: ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌వో టూ జీఎం కే.రఘుకుమార్ అ న్నారు. మంగళవారం ఎస్సార్పీ -1 గనిపై మల్టీ డిపార్టుమెం టల్ కమిటీ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సంస్థ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు బొగ్గు నాణ్యతను కూడా పెం చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్ చంద్ర శేఖర్‌రెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏజెం ట్ గోపాల్ సింగ్, మేనేజర్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మహిళల సంరక్షణకే భరోసా కేంద్రం

నస్పూర్: మహిళల సంరక్షణకే భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, మోహన్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని పాత పోలీస్‌స్టేషన్ భవనంలో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని డీజీపీ రవిగుప్తా వర్చువల్‌గా ఏసీపీలు ప్రత్యక్షంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ లు, చిన్నారులు తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి పోలీస్ స్టేషన్‌లకు రావాడానికి ఇబ్బందులు పడుతుంటారని, పోలీస్ స్టేషన్ రావాల్సిన అవసరం లేకుండానే భరోసా కేంద్రంలో తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కేంద్రంలో సలహాలు, సూచనలు ఇవ్వడానికి పోలీసు, న్యాయ, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. భార్యాభ ర్తల మధ్య సమస్యలు, లైంగిక వేధింపులు, తదితర సమస్యల పరిష్కారానికి కూడా భరోసా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, మంచిర్యాల రూరల్, శ్రీరాంపూర్ సీఐలు ఆకుల అశోక్, బన్సీలాల్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

'వెంకటేష్‌నేత కాంగ్రెస్‌లో చేరడం ఆ పార్టీకి మచ్చ'

బెల్లంపల్లి: పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత కాంగ్రెస్‌లో చేరడం ఆపా ర్టీకి మాయని మచ్చ అని ఆరిజిన్ డెయిరీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి (సీఏవో) బోడపాటి శేజల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనకు అన్యాయం చేస్తే ఎంపీ అండగా ఉండి చిన్నయ్యను కాపాడారన్నారు. అలాం టి నాయకుడిని పార్టీలో చేర్చుకోవడం వల్ల కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం జరిగే అవ కాశం ఉందన్నారు. ఎమ్మెల్యేను కాపాడే ప్రయత్నంలో తమపై తప్పుడు కేసు లు బనాయించారన్నారు. ఒక మహిళకు న్యాయం చేయకుండా క్రిమినల్స్‌కు అండగా ఉండి కాపాడిన వెంకటేష్‌నేత లాంటి వారికి ఎంపీ సీటు కేటాయిస్తే కచ్చితంగా ఓటమి తప్పదన్నారు. కాంగ్రెస్ పార్టీ తనకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి



మొక్క నాటుతున్న ఈడీ రఘునాథ్‌రావు

మంచిర్యాలఅర్బన్: మేడారం జాతరకు వెళ్లే భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపా లని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ రఘునాథ్‌రావు సూచించారు. మేడారం సమ్మక్క-సారాలమ్మ జాతర నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలపై ఉమ్మడి జిల్లా ఆర్టీసీ అధికారులతో మంగ ళవారం సమీక్ష నిర్వహించారు. జాతరకు వెళ్లే బస్సుల నిలిపేందుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం స్థలం పరిశీలించారు. మం చిర్యాల డిపోను పరిశీలి ంచి మొక్కలు నాటారు. గ్యారేజ్ కార్మికులు, డ్రైవ ర్లు, కండక్టర్లకు పలు సూచనలు చేశారు. ఆర్టీసీ బ స్సుల్లో ప్రయణికులకు అసౌకర్యం కలుగకుండా జా గ్రత్తలు పాటించాలన్నారు. జాతరకు కేటాయిం చిన బస్సులు, బస్సు పాయింట్ల వివరాలు అడిగి తెలు సుకున్నారు. జాతర వేళ ప్రతీ ఉద్యోగి సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచిం చా రు. సమీక్షలో ఆర్‌ఎం సోలోమన్, డిప్యూటీ ఆర్‌ఎంఎం ప్రవీణ్, డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్, ఆయా డిపో ల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రజాభవన్‌లో కాంట్రాక్ట్ కార్మికుల వినతి

శ్రీరాంపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూని యన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ సులబ్ కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పదేళ్లుగా వేతనం పెరగలేదన్నారు. చట్టబ ద్ధ హక్కులు కల్పించాలని, సదుపాయాలు మెరుగుపర్చాలని, లాభాల్లో వా టా చెల్లించాలని, బోనస్ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. మంతెన లక్ష్మణ్, నరసయ్య, నారాయణ, లక్ష్మి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల అన్నం.. నీళ్ల చారు..

- సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో తల్లిదండ్రుల ఆందోళన



పురుగుల అన్నం



నిర్బంధంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ పురుగుల అ న్నం, నీళ్ల చారుతో మేం తినలేమంటూ ముల్కల్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల వి ద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. స మాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి పురుగుల అన్నం చూసి అవాక్కయ్యారు. దీం తో ఆందోళనకు సిద్ధమవుతుండగా ప్రిన్సిపాల్ వారి ని బయటకు రాకుండా నిర్బంధించారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు పాఠశాలకు వెళ్లడంతో ప్రిన్సిపాల్ గేట్లు తెరిపించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్ల ల ఉజ్వల భవిత కోసం గురుకుల పాఠశాలలో చే ర్పిస్తే ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఇటు సరైన ఆహారం తిన డం లేదని, అటు చదువు కూడా సరిగా చెప్పక పో వడంతో తీవ్రంగా నష్ట పోతున్నామన్నారు. గతంలో మంచిర్యాలలోని అండాళమ్మ కాలనీలో ఉన్న పాఠశాల ఆ ప్రాంతంలోని డంప్‌యార్డు పొగ, దుర్గంధం భరించలేకపోవడంతో ఆర్నెళ్ల పాటు కలె క్టర్ చుట్టూ తిరిగితే ముల్కల్లలోని ప్రైవేట్ భవనం లోకి మార్చారన్నారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కారణం గా విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి నెట్టేస్తు న్నారన్నారు. దీనిపై ఎస్సీ సంక్షేమ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కుమ్మరి మోహన్ మాట్లాడుతూ అన్నంలో పురుగులు రాలేదని, క్యాబే జీలో వచ్చాయన్నారు. అవి చూసుకోకుండానే విద్యార్థులు తినే ప్లేట్లలోకి వచ్చాయని, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నామన్నారు. విద్యా ర్థుల సంక్షేమంపై నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. విద్యార్థులతో మాట్లాడేందుకు తల్లిదండ్రులు పైకి వెళ్లారని ఆ సమయంలోనే అనుకోకుండా తాళం వేసామే తప్ప వారిని నిర్బంధించలేదన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు కార్మెల్ అకాడమీ

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రిరూరల్: మందమర్రిలోని కార్మెల్ పాఠ శాల క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తోందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నా రు. పాఠశాల ఏర్పాటై 60 సంవత్సరాలు పూర్తి చేసు కున్న సందర్భంగా మంగళవారం నిర్వహించిన డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాభావంతో ఏర్పాటు చేసిన పాఠ శాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు అనేక రంగాల్లో రాణించారన్నారు. కార్మెల్ అకాడమీకి కావాల్సిన ఎలాంటి సహాయ సహకారాలైన అం దిస్తానన్నారు. ఆదిలాబాద్ డయాసిస్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రిన్స్ ఆంటోనీ మాట్లా డుతూ నూతనంగా డిగ్రీ కళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు భవిష్యత్‌లో చక్కని విద్యను అందించ నుందన్నారు. పూర్వ విద్యార్థి మునీర్ మాట్లాడుతూ కార్మెల్ పాఠశాలలో చదివినందుకు గర్వంగా ఉంద న్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్య క్రమాలు అలరించాయి. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఎంఈవో జాడి పోచయ్య, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో 2024-25 సంవత్సరానికి గానూ అంచనా బడ్జెట్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి గానూ అంచనాలు, పద్దుల వారీగా నిఖర ఖర్చులతో పాటు సమగ్ర అంచనా బడ్జెట్‌ను రూపొందిం చాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పం చాయతీలు, మున్సిపాలిటీల నుంచి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్సు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠకులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు, ఇతర మెటీరియల్ అందు బాటులో ఉంచాలన్నారు. దండేపల్లి గ్రంథాలయా నికి రూ.30 లక్షలు, వేమనపల్లి గ్రంథాలయానికి రూ.12.50లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటే శ్వర్‌రావు, జిల్లా వయోజన విద్యాధికారి పురు షోత్తం నాయక్, జిల్లా విద్యాశాఖ సెక్టార్ అధికారి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

మూడు బస్సులపై కేసు



ప్రైవేట్ బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హైదరాబాద్ నుం చి రాయ్‌పూర్, లోర్మి, బాలఘాట్ ప్రాంతాలకు అత్యధిక లోడుతో వెళ్తున్న మూడు బస్సులపై జిల్లా రవాణా శాఖా కొరడా ఝుళిపించింది. సోమవారం రాత్రి డీటీవో కిష్టయ్య ఆదేశాల మేరకు ఎంవీఐ గుర్రం వివేకానంద్‌రెడ్డి మందమర్రి టోల్ ప్లాజా సమీపంలో బస్సులను ఆపి తనిఖీ చేశారు. కంకర్ ట్రావెల్స్‌లో 45 మందికి గానూ 80 మందితో, దూబే ట్రావెల్స్‌లో 22 మందికి గానూ 61 మంది, తోమర్ ట్రావెల్స్ బస్సులో 32 మందికి గానూ 84 మంది ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించారు. ఈ మూడు బస్సులపై కేసులు నమోదు చేసి భారీ జరి మానా విధించనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డులు రవి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.